ఈనాడు
మెదక్

నియోజకవర్గానికి 3500 ఇళ్లు: కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో భాగంగా వర్షాలతో కూలిన ఇళ్లకు, ఇళ్లు లేని అర్హులైన పేదలను గుర్తించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో ప్రభుత్వం రూ.5లక్షలు చెల్లించనుందని తెలిపారు. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో అన్ని పాఠశాలల్లో శానిటేషన్ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

దరఖాస్తులు పరిష్కరించాలి..

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. భూసమస్యలపై 15, ఇతర సమస్యలపై 20 అర్జీలు వచ్చాయి. ధరణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగం కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి, కొల్చారం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 132 కేవీ విద్యుత్తు కేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం మూడు మండలాలకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిలప్‌చెడ్, కౌడిపల్లి, కొల్చారం మండలాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు విషయం గమనించి సహకరించాలని కొల్చారం ఏఈ అలీ తెలిపారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం



● సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక మొదలు ఐదో తరగతి వరకు 94 మంది చదువుతున్నారు. నిత్యం ఉదయాన్నే ప్రార్థన సమయంలో చేతుల శుభ్రతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. పిల్లల ఆరోగ్యానికి ఇలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఎం సయ్యద్ సంధాని చెబుతున్నారు. వంట నిర్వాహకుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.


బక్రిచెప్యాల ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ సంధాని

న్యూస్‌టుడే, మెదక్, సిద్దిపేట

జిల్లాలో ఇలా..
- జనాభా: 7.10 లక్షలు
- అన్ని రకాల విద్యాలయాలు (1-10వ తరగతి వరకు): 1057
- విద్యార్థులు: 1.20 లక్షలు


ఆరోగ్యమే మహాభాగ్యం. ఇందుకు ప్రతీ అంశం కీలకమే. దినచర్యలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే.. సురక్షిత శుభ్రత అత్యంత ప్రాధాన్యంగా కూడుకుంది. తద్వారా ఎన్నో రోగాల నుంచి కాపాడుకో వచ్చని వైద్యులు సూచిస్తున్నారు. జీవిత ఆరోగ్య స్పృహ పెరిగినా.. విద్యాలయాల్లో కచ్చితంగా అమలు చేయాలి. నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మెదక్ మాతాశిశు సంరక్షణ కేంద్రానికి చెందిన వైద్యులు డా. చంద్రశేఖర్‌రావు ఇలా వివరించారు.



అపరిశుభ్రతతో.. అనారోగ్యానికి కారణం. చిన్నారుల్లో అవగాహన లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒకప్పటితో పోలిస్తే కొంత మార్పు కనిపిస్తోంది. విద్యాసంస్థల్లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొంది. అత్యధిక చోట్ల నీటి వసతి ఉన్నా సబ్బు లేదా ద్రావణాలు ఉండటం లేదు. మధ్యాహ్న భోజనం, స్నాక్స్ తినే ముందు, ఆడిస్తూ, శౌచాలయానికి వెళ్లినప్పుడు మామూలుగా శుభ్రం చేసుకుంటున్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు దీనిపై శ్రద్ధ వహించాలి. గ్రామాల్లో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.

- భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి. ఒక నిమిషం ఇందుకు కేటాయించాలి.
- దగ్గినా, తుమ్మినా విస్మరించొద్దు.
- మల, మూత్ర విసర్జన తర్వాత కాళ్లు, చేతులు కడుక్కోవాలి.
- పాఠశాలల్లో ద్రావణం లేదా సబ్బును అందుబాటులో ఉంచాలి.
- ఉంగరాలు పెట్టుకునే చేతి వేళ్లను ఎక్కువ శుభ్రం చేయాలి.
- వైరస్, బ్యాక్టీరియాలు ఒంట్లోకి చేరేందుకు చేతులే వాహకాలు. కళ్లు, ముక్కు, నోటిని తరచూ చేతులతో తాకే ప్రయత్నం చేయొద్దు.
- చేతుల శుభ్రత అలవాటుగా మారితే అనారోగ్య సమస్యల నుంచి 90 శాతం భద్రంగా ఉన్నట్టే.

చేతుల శుభ్రతపై వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' బృందం సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.



బాధ్యత వహిస్తే.. సబ్బు లేదా ద్రావణంతో చేతుల శుభ్రతతో అతిసారం 90 శాతం, శ్వాసకోశ వ్యాధులను 20 శాతం వరకు నివారించవచ్చు. కలరా, ఎబోలా, హెపటైటిస్-ఈ తదితర వాటి కారకాల వ్యాప్తిని అడ్డుకోవచ్చు. కడగకుండా అల్పాహారం, ఆహారం తీసుకుంటే హానికర క్రిములు పొట్టలో చేరే అవకాశం మెండు. కొన్ని సందర్భాల్లో టైఫాయిడ్, కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. తల్లిదండ్రులు బాధ్యతగా బాల్యంలోనే అవగాహన కల్పించాలి.

చైతన్యం తీసుకొస్తూ.. శివ్వంపేట మండలం బిజిలీపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరోగ్యం విద్యార్థులు చేతి శుభ్రత పక్కాగా పాటిస్తున్నారు. ఇక్కడ హెచ్ఎంగా పని చేసిన గోపాల్‌రెడ్డి ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపి మార్పు తీసుకొచ్చారు. ఉపాధ్యాయుల సహకారంతో పిల్లలకు అవగాహన కల్పించడంతో పాటు బడిలో అన్ని ఏర్పాట్లు చేయించారు. ప్రస్తుత హెచ్ఎం రామచంద్రారెడ్డి సైతం దీన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు వైద్యాధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ చేతి శుభ్రతపై చైతన్యం తీసుకొస్తున్నారు. – న్యూస్‌టుడే, శివ్వంపేట



అర్జీలు స్వీకరించి.. సీఐలకు పురమాయించి

మెదక్, న్యూస్‌టుడే: ప్రజా విజ్ఞప్తులలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అర్జీలు స్వీకరించారు. వాటి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి సూచనలు చేశారు.

గోదాం నిర్మాణంతో ఇబ్బందులు దూరం

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలోని మిల్లర్లు త్వరగా బియ్యం అందజేసేందుకు కేంద్ర గిడ్డంగుల గోదాంను అందుబాటులోకి తీసుకువచ్చామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక కేంద్ర గిడ్డంగుల సంస్థ నిర్మించిన నూతన గోదాంను ఆయన ప్రారంభించారు. గతంలో ఉన్న ఇబ్బందులు దూరమవుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సురేష్ రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, సీడబ్ల్యూసీ మేనేజర్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దోమ తెగులు.. రైతుకు దిగులు



వరి పంటకు దోమ తెగులు సోకడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కోతకు వచ్చిన సమయంలో పంటకు నష్టం జరగడంతో పండించిన చేతులతోనే నిప్పు పెడుతున్నారు. శివ్వంపేట గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు కౌలుకు చేస్తున్న పొలంలో వరి పంటకు దోమ తెగులు సోకింది. నివారణ మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో పూర్తిగా వ్యాపించకుండా మడిలో వరికి నిప్పు పెట్టాడు. **-న్యూస్‌టుడే, శివ్వంపేట**

సమస్యల పరిష్కారానికి సహకరించండి


సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

న్యూస్‌టుడే, నర్సాపూర్: విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డిలను నర్సాపూర్‌లో కలిసి సోమవారం వినతి పత్రం సమర్పించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు స్వామి, రాములు, సోషల్ మీడియా బాధ్యులు నాగరాజు తదితరులు ఉన్నారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, నాయకులు దుర్గేశ్, సురేష్, నరేష్, మురళి తదితరులున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా మధుసూదన్‌రావుకు మద్దతు: ఎస్టీటీయూ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంకినేని మధుసూదన్‌రావును బలపర్చాలని నిర్ణయించినట్లు ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. తమ లక్ష్యాలను నెరవేర్చడానికి పెద్దల సభలో తమ అభ్యర్థిగా ఆయన పేరును బలపర్చడం జరిగిందన్నారు. ఆయనకు ఓటు వేయాలని కోరారు.

జిల్లా సంక్షేమ అధికారిణిగా హైమావతి

మెదక్, న్యూస్‌టుడే: జిల్లా సంక్షేమ అధికారిణిగా హైమావతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లా తొర్రూరు సీడీపీవోగా పనిచేసిన ఆమె పదోన్నతిపై జిల్లా సంక్షేమ అధికారిగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

అభివృద్ధికి నిరంతర కృషి: కొత్త


బి.కొండాపూర్‌లో దుర్గామాత శోభాయాత్రలో ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, న్యూస్‌టుడే: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం బి.కొండాపూర్, నార్సింగిలో జరిగిన దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భారాస నాయకులు నారాయణరెడ్డి, కుమ్మరి బాబు, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో వక్ఫ్ భూములు

పట్టించుకోని అధికారులు

న్యూస్‌టుడే, నర్సాపూర్: అత్యంత విలువైన వక్ఫ్ భూములు ఆక్రమణలకు గురవుతుండటంతో ఆశాఖ అధికారులే పలుమార్లు సర్వేలు జరిపారు. కబ్జాల అంతు తేల్చారు. ఈ భూములు తమవేనంటూ బోర్డులు ఏర్పాటు చేస్తుంటారు. అక్రమార్కులకు నోటీసులు కూడా అందజేస్తారు. కానీ చర్యలకు మాత్రం ఉపక్రమించలేదు. ఇదీ నర్సాపూర్‌లో ఎప్పుడూ జరిగే తంతే. గతంలోని పంచాయతీ అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేయడంతో భారీ నిర్మాణాలు వెలిశాయి. రూ.కోట్ల విలువైన భూములు ఇతరుల పరాధీనమయ్యాయి. పురపాలికగా ఏర్పాటయ్యాక కూడా ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదు.


నర్సాపూర్‌లో హైవేకు ఇరువైపులా ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములు

పక్కా నిర్మాణాలు చేపట్టి

నర్సాపూర్‌లోని మెదక్-నర్సాపూర్-హైదరాబాద్ (765-డి) ప్రధాన జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపార అవసరాలకు ఉపయోగపడే, సంగారెడ్డి మార్గంలో సాగు యోగ్యమైన రూ.కోట్ల విలువైన వక్ఫ్ భూములున్నాయి. ఇవి మొత్తం 44 సర్వే సంఖ్యలో ఉన్నాయి. పది ఎకరాల వరకూ కౌలుకు ఇచ్చారని సమాచారం. పట్టణంలోని జాతీయ రహదారిని అనుకొని ఉన్న సర్వే సంఖ్యలు 1,2,56,57,58,59,60 లోని 30ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. వీటిల్లో కొందరు గుడిసెలు వేసుకొని పక్కా నిర్మాణాలు చేపట్టగా, మరి కొందరు లీజు, ఇనాంల పేరిట తీసుకోగా ఇంకొందరు అమ్మకాలు సాగించారు. దీంతో అక్రమార్కులు ఇంటి నంబర్లు, బ్లాక్ నంబర్లు వేసి, నోటరీ, రిజిస్ట్రేషన్లు పూర్తిచేశారు. కొందరు మార్కెట్ విలువ చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారు.

గజం భూమి రూ.లక్షల్లో

ఇక్కడ గజం భూమి రూ.లక్ష వరకూ పలుకుతుంది. రూ.వంద కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆ శాఖ అధికారులే గతంలో తేల్చారు. నివేదికలూ సమర్పించారు. కొందరికి తాఖీదులు ఇచ్చారు. అయినా వారిపై ఎలాంటి చర్యలూ లేవు. పలుకుబడి కలిగిన వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు ఆక్రమణదారుల్లో ఉన్నారు. శ్మశానవాటికల్ని సైతం వదలకుండా ఆక్రమించేశారు. అత్యంత విలువైన భూములను వక్ఫ్ అధికారులే లీజుకు ఇస్తే బోర్డుకు, పురపాలికకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

సూచిక బోర్డులు మాయం...

నర్సాపూర్‌లో విలువైన భూముల్లో 1998లో అప్పటి బోర్డు అధ్యక్షులు, ఇన్‌స్పెక్టర్ వచ్చి సర్వే జరిపి హద్దులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు పాతించారు. వీటిల్లోకి ఎవరూ కూడా అడుగు పెట్టరాదంటూ హెచ్చరికలు చేశారు. ఆ తర్వాత సూచిక బోర్డులను మాయం చేసేశారు. కబ్జాలకు తెరలేపారు. 1999లో ఆర్డీవో 47 మంది ఆక్రమణదారులకు తాఖీదులు ఇచ్చారు. భూములను అప్పగించాలని ఆదేశించారు. అయినా నేటికి ఎలాంటి చర్యలు లేవు. సాగు భూములు సైతం చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. వక్ఫ్ భూములకు పట్టాదారులుగా ఇతరుల పేర్లు రికార్డులకు ఎక్కడం గమనార్హం. దీనిపై ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా గెజిట్‌లో భూముల వివరాలు ఉంటాయని వాటి ఆధారంగా విచారణ చేపడుతామని అన్నారు.

సాగుకు సాయం

పీఎం కిసాన్ నిధులు విడుదల

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా రైతులకు పంట సాయం కింద అందించే నగదును విడుదల చేసింది. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల చొప్పున అందజేస్తోంది. ఇందులో భాగంగా పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది.



18వ విడత సాయం...

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం మూడు విడతల్లో ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చిలలో అర్హులకు నిధుల బదిలీ చేపడుతున్నారు. ప్రస్తుతం 18వ విడతగా ఈనెల 7వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ ప్రారంభమైంది. 2019 ఫిబ్రవరి 1వ తేదీని కటాఫ్‌గా పెట్టుకొని ఆలోపు భూమి యాజమాన్య హక్కులు ఉన్నవారు పథకంలో నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. కొత్త పట్టాదారుల నమోదుకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో లబ్ధిదారుల నమోదుకు అవకాశం కల్పించడం లేదని పేర్కొంటున్నారు.

తగ్గుతున్న లబ్ధిదారులు

గతంలో అందించిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి రైతు భరోసాగా పేరుమార్చి అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే పంట సాగు సాయానికి పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధులు చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. మరోవైపు కొత్త రైతులకు అవకాశం కల్పించకపోగా పాతవారిని జాబితాలో నుంచి తొలగిస్తున్నారు. ఈకేవైసీ పూర్తి చేయనివారికి, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేనివారికి నిధులందటం లేదు. రేషన్‌కార్డుల ఆధారంగా కుటుంబంలో ఒకరినే పరిగణనలోకి తీసుకోవడం, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారిని క్రమంగా పథకంలో నుంచి తొలగిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. తొలి విడతలో జిల్లాలో 1.43 లక్షల మంది రైతులకు నిధులందగా.. ప్రస్తుతం 88 వేలకు తగ్గింది. కొత్త రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తే వేలల్లో రైతులు ఈ పథకంలో చేరనున్నారు. లబ్ధిదారుల ఎంపికకు ఐదేళ్లు దాటిందని, ఇప్పటికైనా నమోదుకు అవకాశాన్ని కల్పించి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జిల్లాలోని
- మండలాలు: 21
- వ్యవసాయ క్లస్టర్లు: 76
- రైతులు: 2.80 లక్షలు
- సాగు భూమి: 3.97 లక్షల ఎకరాలు
- జిల్లా వ్యాప్తంగా అర్హులు: 88,200 మంది
- పంట సాయం: రూ.17.64 కోట్లు

ఖాతాల్లో నిధులు జమ

– గోవింద్, జిల్లా వ్యవసాయ అధికారి

పీఎం కిసాన్ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. 18వ విడతగా మంజూరైన నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. రోజు వారీగా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతోంది.

భూ అక్రమాలపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రావెల్లివాసి


తూప్రాన్, న్యూస్‌టుడే: పోతరాజ్‌పల్లిలోని ఓ మీ-సేవా కేంద్రం నిర్వాహకుడితో కలిసి తూప్రాన్ రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు రావెల్లికి చెందిన గణేశ్ ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో ఆధారాలతో వివరించారు. 438 సర్వే నంబరులో మీ-సేవా నిర్వాహకుడి వంశానికి సంబంధించిన ఎలాంటి అసైన్డ్ భూమి లేకున్నా.. రెవెన్యూ అధికారుల అండతో 8గుంటల భూమి తన పేరిట రికార్డులో రాయించుకున్నారని ఫిర్యాదు చేశాడు. 445 సర్వే నంబరులో 30గుంటల అసైన్డ్ భూమి ఉండగా 5.17ఎకరాలకు పెంచి పలువురు రైతుల వద్ద పెద్ద ఎత్తున నగదు తీసుకొని వారికి పట్టాగా మార్పిడి చేశారన్నారు. కానుకుంటకు సంబంధించిన సర్వే మ్యాపును సైతం మార్చారని, 144 సర్వే నంబరులో సీలింగ్ పట్టాను కొందరికి అక్రమంగా పట్టా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే స్పందించిన కలెక్టర్.. ఈ విషయంలో విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఫోన్‌లో తూప్రాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

నేడు ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల సమావేశం

న్యూస్‌టుడే, నర్సాపూర్: ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి, శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులతో నర్సాపూర్‌లోని రైతు వేదికలో అవార్డు విచారణ మంగళవారం ఉంటుందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉదయం రెడ్డిపల్లి, మధ్యాహ్నం కొంతాన్‌పల్లి గ్రామాల రైతులు హాజరుకావాలన్నారు. రైతులు తమ అభ్యంతరాలు తెలియజేయవచ్చని అన్నారు. అభ్యంతరాలు లేకుంటే యథాతథంగా అవార్డు ఆమోదించడం జరుగుతుందన్నారు.

ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలా..?

అదనపు వసూళ్లపై ప్రయాణికుల ఆందోళన


నర్సాపూర్‌లో రాస్తారోకో చేస్తూ..

నర్సాపూర్: ఆర్డినరీ బస్సులను స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని నర్సాపూర్‌లో ప్రయాణికులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వెళ్లే మార్గంలో ఆందోళనకు దిగారు. ఆర్డినరీ బస్సులకు స్పెషల్ బస్సుల పేరిట స్టిక్కర్లు అంటించారని, వాటిలో బస్ పాసులు అనుమతించడం లేదని వాపోయారు. దసరా పండగ రద్దీని గమనించి అదనపు ఛార్జీలు మోపడం తగదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేసి పురుషులకు మాత్రం ఛార్జీలు పెంచడం సరికాదంటూ నిరసన వ్యక్తం చేశారు. నర్సాపూర్ డిపో బాధ్యుడు లక్ష్మణ్ ప్రయాణికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. పోలీసులు రావడంతో ఆందోళన విరమించారు. ఆందోళన నేపథ్యంలో మెదక్-హైదరాబాద్ మార్గంలో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

ఉద్యమకారుడికి హరీశ్‌రావు నివాళి


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి

పెద్దశంకరంపేట: తెలంగాణ ఉద్యమకారుడు, తాజా మాజీ జడ్పీటీసీ సభ్యుడు భూత్కురి విజయరామరాజు(44) అనారోగ్యంతో ఆస్పత్రిలోచికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్కాపురం గ్రామానికి చెందిన విజయరామరాజు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. 2013లో మల్కాపురం సర్పంచిగా, 2019లో జడ్పీటీసీ సభ్యునిగా గెలుపొందారు. భారాస మండల అధ్యక్షుడిగా పని చేశారు. మల్కాపురంలో విజయరామరాజు భౌతికకాయానికి మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీలు శేరిసుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నేతలు ఉన్నారు.

నేడు డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ-2024కు నూతనంగా ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ఎస్జీటీలకు, స్కూల్ అసిస్టెంట్లకు ఒకేసారి పాఠశాల కేటాయింపు గురించి వివరించనున్నట్లు పేర్కొన్నారు. నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులు స్వయంగా హాజరు కావాలని సూచించారు.

తరుణీ.. శక్తిస్వరూపిణి



గ్రామీణ మగువ.. కొంగు నడుముకు బిగించి పొలంలో పంట పండించి రైతుగా అన్నం పెడుతోంది. . ఉపాధి హామీ పథకంలో స్వేదాన్ని చిందించి గ్రామీణ వలసల నివారణకు చోదకశక్తిగా నిలుస్తోంది. . పొదుపు ఉద్యమానికి హారతి పడుతోంది.. రుణాలతో స్వయం ఉపాధికి బాటలు వేసుకొని ఆర్థిక స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తోంది.. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన గ్రామీణ మహిళలు నేడు శక్తిగా మారి అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తుండటం విశేషం. నేడు 'అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం' నేపథ్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సమస్యలు అధిగమించి విజయాలు సాధించిన వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

నేడు ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం

	సంగారెడ్డి	సిద్దిపేట	వికారాబాద్	మెదక్
మహిళలు (లక్షల్లో..)	4.90	4.47	4.26	3.88
పొదుపు సంఘాలు	18,208	18,274	15,525	13,061
సభ్యులు(లక్షల్లో..)	1.91	1.94	1.62	1.37

- న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ కలెక్టరేట్

ప్రధాని నుంచి సత్కారం

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కంతి లక్ష్మి జాతీయస్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికై గ్రామీణ మహిళ ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు. జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పారిశుద్ధ్య కార్మికురాలిగా గ్రామం స్వచ్ఛంగా ఉంచడంలో కీలకపాత్ర పోషించారు. ఈమె చిత్తశుద్ధిని గమనించిన అధికారులు ఆమెను ఎంపిక చేశారు. ఈమె భర్త కంతి సైదప్ప. వీరికి ఎకరం పొలం ఉంది. మూడేళ్ల క్రితం భర్త అనారోగ్యం పాలవడంతో ఆయన స్థానంలో ఉద్యోగంలో చేరారు. రోజూ తడి, పొడి చెత్త వేరు చేయడం.. ఇనుము, గాజు అమ్మకం ద్వారా పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేస్తున్నారు. వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువుగా మార్చడం వంట పనులు నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొడంగల్



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో లక్ష్మి

అతివలకు అండగా నిలుస్తూ..

ఆమె చదివింది ఐదో తరగతే. అయినా తనవంతుగా ఏదైనా చేయాలన్న సంకల్పంతో అడుగేసి నిస్సహాయులకు అండగా నిలుస్తున్నారు. ఆమే నర్సాపూర్ మండలం లింగాపూర్‌కు చెందిన చింతల లక్ష్మి. కొన్నాళ్ల కిందట గ్రామంలో భువనేశ్వరి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక మహిళలకు అవగాహన కల్పించి సంఘంలో చేర్పించి పొదుపు బాట పట్టించారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడంపై చైతన్యం తీసుకొస్తూ ఎంతోమంది ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. జిల్లా స్థాయి కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్‌గా ఎదిగారు. ఉమ్మడి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా సైతం పని చేశారు. మరోవైపు అక్షరాస్యత పెంచేందుకు గ్రామీణ మహిళలకు చదువు నేర్పించారు. గ్రామాల్లో సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐకేపీ జెండర్ ఫోకల్ పాయింట్ పర్సన్‌గా పనిచేస్తున్నారు. దంపతుల మధ్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్



చింతల లక్ష్మి

వీఓఏ నుంచి పారిశ్రామికవేత్తగా..

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిని కనకతార వీఓఏగా పని చేస్తూనే వ్యాపారంలో రాణిస్తున్నారు. స్వయం సహాయక బృంద సభ్యురాలి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలిచారు. అరుంధతి సంఘం సభ్యురాలిగా అడుగేసిన ఈమె 2005 నుంచి వీఓఏ (సీఏ)గా పని చేస్తున్నారు. 2012లో టైలరింగ్ యూనిట్ ఏర్పాటుచేశారు. 40 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. తర్వాత రూ.కోటితో వేర్వేరు జిల్లాల్లో వస్త్ర సంచులు, పళ్లేల తయారీ యూనిట్లనూ నెలకొల్పారు. ఈ నెల 17న దిల్లీలో జరిగే జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్ల సదస్సులో పాల్గొనే అవకాశాన్ని అందుకున్నారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం



వస్త్ర సంచుల తయారీలో కనకతార

ఇటు పొలం.. అటు చిత్రీకరణ



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్‌కు చెందిన లక్ష్మమ్మ చిన్నతనం నుంచి వ్యవసాయ కూలీగా పని చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో జహీరాబాద్‌కు చెందిన డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్)లో చేరిన తర్వాత ఈమె బతుకు మారింది. సంస్థ నిర్వాహకుల ప్రోత్సాహంతో వీడియో చిత్రీకరణ నేర్చుకున్నారు. 35 ఏళ్లకు పైగా పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వీడియోలను తీసి గుర్తింపు దక్కించుకున్నారు. 52 ఏళ్ల ఈ మహిళ సేంద్రియ విధానంలో చిరుధాన్యాల సాగు చేస్తున్నారు. సంప్రదాయ పద్ధతిలో విత్తనాలను నిల్వ చేస్తూ సంస్థకు, రైతులకు అందిస్తున్నారు. వివిధ రాష్ట్రాలతో పాటు 11కు పైగా దేశాల్లో పలు సమావేశాలను చిత్రీకరించారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్

క్రీడాకారిణులను తీర్చిదిద్దుతూ..



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మాటిండ్లకు చెందిన భాగ్యమ్మ.. ఫుట్‌బాల్ శిక్షకురాలిగా ఎంతో మంది క్రీడాకారిణులను తీర్చిదిద్దుతున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె హకీంపేట క్రీడా పాఠశాలలో శిక్షణ పొందారు. రాష్ట్ర స్థాయిలో 6 స్వర్ణ పతకాలు సాధించారు. 12 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానంలో నిత్యం 80 మంది విద్యార్థినులకు మెలకువలు నేర్పిస్తున్నారు. ఈమె పర్యవేక్షణలో శిక్షణ పొందిన సీనియర్ మహిళా జట్టు గత నెలలో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరుకుంది. తాజాగా మెదక్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీల్లో మెదక్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. – న్యూస్‌టుడే, మెదక్ టౌన్

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



మాధవి, శాకేర

కొండాపూర్: జాతీయ స్థాయి యోగా పోటీలకు కొండాపూర్ మండలం గంగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు మాధవి, శాకేర ఎంపికయ్యారని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రమేశ్ సోమవారం తెలిపారు. పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. నవంబరు 11 నుంచి 14 వరకు అస్సాంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు.

కథ రాసి.. బహుమతి దక్కించుకొని..



ప్రహర్షిణి

సిద్దిపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ప్రహర్షిణి ప్రతిభ కనబర్చారు. విద్యార్థిని రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 232 కథల్లో 28 వివిధ విభాగాల్లో ఉత్తమంగా నిలిచాయి. వాటిలో ప్రహర్షిణి రాసిన కథ ఒకటవడం విశేషం. నవంబరు 3న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం ప్రదానం చేయనున్నారు. ఆమెను హెచ్‌ఎం షౌకత్‌అలీ, ఉపాధ్యాయులు అభినందించారు.



న్యాల్‌కల్ బసవన్నకు జాతీయస్థాయి గుర్తింపు

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు హోతి బస్వరాజు రూపొందించిన 'మాడ్రన్ హస్బెండ్రీ' కళాకృతి జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి దక్కించుకుంది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'ఇండియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' నిర్వహించే 'ఆల్ ఇండియా ఎగ్జిబిషన్ ఆఫ్ ఆర్ట్స్-2024' పోటీల్లో దీన్ని ప్రదర్శించారు. ఈనెల 26న బస్వరాజు పురస్కారం అందుకోనున్నారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

ఐఐటీహెచ్-కెన్యా బృందం ఒప్పందం

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐఐటీహెచ్‌ను సోమవారం సందర్శించింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియా-కెన్యా ఇన్నోవేషన్ నెక్సస్ పేరుతో రూపొందించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కెన్యా పార్లమెంట్ సభ్యులు ఎదిత్ వెతి నైన్జ్, అమినా దికా అబ్దుల్లాహితోపాటు 11 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాజాగా కుదుర్చుకున్న ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. సాంకేతిక, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు మార్గం సుగమం కానుందని పేర్కొన్నారు.



ఐఐటీహెచ్‌లో కెన్యా బృందం సభ్యులు

అబ్దుల్‌కలాంకు చిత్ర నివాళి

భారత క్షిపణి పితామహుడు, ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రజ్ఞుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండు శివకుమార్ ఎండిన రావి ఆకులపై మిస్సైల్ మ్యాన్ చిత్రాలు, పచ్చి ఆకులపై కలాం చిత్రాలు, అరచేతిలో, చేతివేలి గోర్లపై కలాం చిత్రాలు, కాగితంపై క్షిపణి, కలాం వివిధ వయస్సులోని చిత్రాలను మలిచి చిత్ర నివాళులు అర్పించారు.

– న్యూస్‌టుడే, నారాయణఖేడ్



సాహిత్యంతో సమాజంలో మార్పు సాధ్యం



శ్రీయశస్విని గ్రంథం విడుదల చేస్తున్న కవులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మంచి మాటలు, సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమని ప్రముఖ కవి, అవధాన విద్యాపీఠం అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయశర్మ అన్నారు. సిద్దిపేటలోని వ్యాసమహర్షి యోగా కేంద్రంలో సోమవారం శ్రీయశస్విని గ్రంథ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. పద్యం ప్రాచీనమైన ప్రక్రియ అయినా నిత్యనూతనంగా, ఉత్తేజితంగా సమాజానికి చేరుతుందన్నారు. 180 మంది కవులతో ఏక మకుటంతో 1800లకు పైగా పద్యాలు చదివే అవకాశం శ్రీయశస్విని గ్రంథం ద్వారా లభించటం సంతోషకరమన్నారు. కవులకు, కళాకారులకు పుట్టినిల్లు సిద్దిపేట అన్నారు. పుస్తక సంపాదకులు, అవధాని డా.బోచ్కర్ ఓంప్రకాశ్ మాట్లాడుతూ.. శ్రీయశస్విని గ్రంథంలోని ప్రతీపద్యం జనజీవనంలోని అంశాలను గుర్తు చేస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, సాయిప్రసాద్, ఎన్నవెల్లి రాజమౌళి, సతీష్, రాజ్‌కుమార్, జబర్దస్త్ లక్ష్మీకిరణ్, సింగితం నరసింహారావు, లక్ష్మయ్య, రంజిత్‌కుమార్, ఫణీంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126-00	డ్రెస్డ్	215-00
రిటైల్	148-00	స్కిన్‌లెస్	244-00

రైతేరాజు

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్య రక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయ కర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

ప్రశ్న: బెండ తోటకు పచ్చదోమ ఆశించింది. ఏం చేయాలి? – విజయ్, కొండాపూర్

సమాధానం: పచ్చదోమ కాయలను తినేసి నష్టపరుస్తుంది. ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ... లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, చేర్యాల

చేపల ఎదుగుదలకు పొటాషియం పర్మాంగనేట్

చేపల పెంపకంలో పలు రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల్లో సున్నం, సాధారణ ఉప్పు, పొటాషియం పర్మాంగనేట్, కాపర్ సల్ఫేట్ వినియోగించడం మంచిది. సున్నం నీటి నాణ్యతను మెరుగుపరుస్తుంది. పొటాషియం పర్మాంగనేట్ చేపల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. కాపర్ సల్ఫేట్‌తో ఫంగస్, శంకుపూత వ్యాధులను అరికట్టవచ్చు. ఇక ప్రోటోజోవన్, క్రస్టేషియన్ పరాన్నజీవుల నిర్మూలనకు ఉపయోగపడుతుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

సెనగ సాగు.. సమయం ఆసన్నం!

న్యూస్‌టుడే, చేర్యాల





విజయ్

పప్పు దినుసులకు ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. వాటిలో కంది తర్వాత సెనగ పప్పుది రెండో స్థానం. అయితే సెనగ సాగుకు ప్రస్తుతం అనుకూలమైన సమయం. ముఖ్యంగా నల్లరేగడి భూముల్లో దీన్ని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమని సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ సూచిస్తున్నారు. వివరాలు ఇలా..

అక్టోబరు- నవంబరు నెలల్లో సెనగ సాగు చేయవచ్చు. నల్లరేగడి నేలలు అనుకూలం. ఈ నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ మొక్కలు పెరుగుతాయి. చౌడు నేలలు పనికి రావు. తొలకరిలో వేసిన పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేసుకోవాలి.

రకాలు, మోతాదు..

జె.జి.11, జె.ఎ.కె.ఐ.9218, కె.ఎ.కె.2, క్రాంతి(ఐ.సి.సి.37), శ్వేత(ఐ.సి.సి.వి.2), అన్నెగిరి, జ్యోతి, ఐ.సి.సి.వి.10 రకాలు మేలైనవి. వీటన్నింటి పంట కాలం 90-110 రోజులు. ఎకరాకు 6-10 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. ఎకరాకు 30-40 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి తప్పనిసరి.


ఎరువులు, నీటి యాజమాన్యం..

ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల గంధకాన్ని ఇచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి. సెనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు పెడితే సరిపోతుంది. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూత, కాయ దశల్లో తడులు అందించాలి.

అంతర కృషి..

విత్తే ముందు ఫ్లూక్లోరాలిన్ 45 శాతం మందును ఎకరాకు లీటరు చొప్పున పిచికారీ చేసి భూమిలో కలియదున్నాలి. లేదంటే పెండిమిథాలిన్ 30 శాతం మందును ఎకరాకు 1- 1.5 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు గానీ పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజుల తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలి. పంటకు పచ్చ, రబ్బరు పురుగుల బెడద ఉంటుంది. ఎండు తెగులు, వేరుకుళ్లు తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు అందుబాటులో ఉండే వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. కోతకు వచ్చిన మొక్కలను పీకి ఆరబెట్టాలి. ఆరిన తర్వాత వారం రోజుల వరకు కుప్ప కట్టి ఉంచాలి. తర్వాత నూర్పిడి చేయాలి.

సాగుపై మక్కువ.. లాభాల ఆర్జన





నర్సింలు

ఆ యువకుడికి సాగంటే ఎంతో మక్కువ. డిగ్రీ పూర్తిచేశాక ఉన్నత విద్య చదివేందుకు వెళ్లకుండా ఇష్టమైన వ్యవసాయంపై దృష్టిసారించారు. అందులోనూ అందరిలా కాకుండా కాలానికి అనుగుణంగా పంటలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన సిందోల్ నర్సింలు. డిగ్రీ పూర్తయ్యాక సాగుపై ఇష్టంతో సంబంధిత విషయాలు తెలుసుకున్నారు. మెలకువలు నేర్చుకున్నారు. ఏ కాలంలో దేనికి డిమాండ్ ఉంటుందో గమనించారు. ఆయనకు మొత్తం 12 ఎకరాల పొలం ఉంది. ఏటా దసరా, దీపావళి పండగల సందర్భంగా మూడు నెలల ముందుగా ఎకరా పొలంలో బంతి సాగు చేస్తున్నారు. నారును హైదరాబాద్ నుంచి తీసుకొస్తున్నారు. పక్కాగా సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నారు. నారింజ, పసుపు వర్ణాలకు సంబంధించిన పూలను పండిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో అవసరం మేర పురుగు మందులు వాడుతున్నారు. మూడు నెలల్లో మూడు కోతల మేర దిగుబడి వస్తోంది. నారు, కూలీలు, మందులు తదితర వాటికి రూ.50 వేల వరకు ఖర్చవుతోంది. మూడు కోతల్లో 5 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. తద్వారా రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. ఖర్చులన్నీ పోగా రూ.1.50 లక్షలు లాభం మిగులుతోంది. మిగతా సమయాల్లో కూరగాయలు పండిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాపన్నపేట

పాటించు.. నివారించు..

కాకర పంటలో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆకుల మధ్య పచ్చగా మారి ఈనెలు ఉబ్బుతున్నాయి. బూజు తెగులు ఆశించి ఇలా జరుగుతుంది. ఆకులు సైతం కిందికి ముడుచుకుపోతాయి. దీని నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

తెల్లజొన్నలో విత్తనశుద్ధి కీలకం

యాసంగిలో రైతులు తెల్లజొన్న సాగు చేపడతారు. విత్తు దగ్గర నుంచి పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి సాధ్యమని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం జొన్న పంట శాస్త్రవేత్త డాక్టర్ సుజాత తెలిపారు. నల్లరేగడి భూములు పంట సాగుకు అనుకూలం. మొక్కల వరుసల మధ్య దూరం అడుగున్నర, మొక్కకు మొక్కకు మధ్య అరడుగు దూరం పాటించాలి. పంట నాలుగు నెలల్లో చేతికొస్తుంది. విత్తనాలు నాటే ముందు శుద్ధి చేయాల్సిందే. కిలో విత్తనానికి 7మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ లేదా 2గ్రా. థయామిథాక్సమ్‌ను కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేదంటే నెల రోజుల్లో మొవ్వ తొలుచు పురుగులు ఆశిస్తాయి. – న్యూస్‌టుడే, తాండూరు

వనరుల సంరక్షణతోనే నీటి ఎద్దడి నివారణ

గొడిగార్‌పల్లి(కోహీర్), న్యూస్‌టుడే: జల వనరుల సమర్థ నిర్వహణతో భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో ఎద్దడి నివారణ సాధ్యమవుతుందని జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ మాజీ ఉపాధ్యక్షుడు మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలం గొడిగార్‌పల్లి సమీపంలో కొన్నేళ్ల కిందట 'చతుర్విధ జల ప్రక్రియ' ద్వారా ఏర్పాటు చేసిన వాటర్‌షెడ్ పథకం నిర్మాణాన్ని సోమవారం ఆయన పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ్‌రెడ్డి, మాజీ సర్పంచి రాచయ్య తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

మితిమీరిన వేగం.. అదుపుతప్పిన వాహనం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



మల్లేశం



రసూల్‌ఖాన్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడు మిత్రులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వేరే గ్రామానికి వెళ్లి, తిరిగి వస్తూ వేగాన్ని నియంత్రించలేక, ఆందోళనకు గురై రోడ్డు దాటుతున్న ఇద్దరిని ఢీకొట్టగా వారిలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. చివరకు వాహనాన్ని అదుపు చేయలేక తానూ కిందపడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన సిద్దిపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామానికి చెందిన ముడికె మల్లేశం (32) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్నాడు. దసరా పండుగకు సొంతూరికి నాలుగురోజుల కిందట వచ్చాడు. ఆదివారం స్నేహితులను కలుద్దామని, మిట్టపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి, అదేరోజు అర్ధరాత్రి తిరుగు పయనమయ్యాడు. సిద్దిపేట రంగీలా దాబా చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న డ్రైవర్లు గణేశ్, రసూల్ ఖాన్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గణేశ్ గాయపడగా, రసూల్‌ఖాన్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో మరింత ఆందోళన గురైన మల్లేశం వాహన వేగం పెంచి, కొంత దూరం వెళ్లాక అదుపుతప్పి కిందపడి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న మల్లేశం సోదరుడు అక్కడికి చేరుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మల్లేశానికి తల్లి, భార్య, కుమారుడున్నారు. రసూల్‌ఖాన్ స్వస్థలం కర్ణాటక బీదర్. ఆయన సోదరుడు అంజద్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

కారు బోల్తాపడి వృద్ధుడు..



నర్సయ్య

నార్సింగి(చేగుంట), న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న వృద్ధుడు మృతిచెందిన ఘటన నార్సింగి మండలం వల్లూరు వద్ద సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై అహ్మద్ మొహినొద్దీన్ తెలిపిన వివరాలు.. మాసాయిపేట మండలం అచ్చంపేటకు చెందిన కత్తెర నర్సయ్య(70) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బంధువు యాదగిరి వైద్యం కోసం నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చాడు. కొన్ని పరీక్షలు హైదరాబాద్‌లో చేయించుకొని రావాలని వైద్యులు సూచించారు. దీంతో కొంపల్లికి వెళ్లి అక్కడ పరీక్షలు చేయించుకొని తిరిగి కారులో నార్సింగికి వస్తున్నారు. వల్లూరు దాటగానే కారు అదుపుతప్పి బోల్తాపడటంతో అందులో ఉన్న నర్సయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నడిపిస్తున్న యాదగిరితో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. వారిని చికిత్స నిమిత్తం నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కుంటలో పడి యువకుడు..



నితిన్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేట శివారులో సోమవారం జరిగింది. పట్టణ మూడో ఠాణా సీఐ విద్యాసాగర్ తెలిపిన ప్రకారం సిద్దిపేట పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన పేర్ల నితిన్(22)కు ఏడాది కిందట పోస్టుమాస్టర్ ఉద్యోగం వచ్చింది. జగదేవపూర్ మండలం చాట్లపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం మిత్రుడు రోహిత్‌తో కలిసి ఇంటినుంచి బయటకు వెళ్లి, రాత్రైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, తాత పెంటయ్య వద్ద ఉన్నానని సమాధానం ఇచ్చాడు. సోమవారం ఉదయం ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానంతో కుటుంబ సభ్యులు నితిన్ ఆచూకీ కోసం వెతుకుతుండగా, పట్టణ శివారులోని తిమ్మికుంట వద్ద అతని చెప్పులు కనిపించాయి. కుంటలో వెతికించగా మృతదేహం లభ్యమైంది. నితిన్‌కు తల్లి లక్ష్మి, తండ్రి రాజు, సోదరి ఉన్నారు. మృతిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైందని సీఐ తెలిపారు.

తల్లి ఆస్తి పంచివ్వలేదని.. తనయుడి బలవన్మరణం

హత్నూర, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన భూమి వాటాను తల్లి పంచివ్వడం లేదన్న మనస్తాపంతో కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. మండల పరిధి దేవులపల్లిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. దేవులపల్లికి మహ్మద్ మహబూబాకు షఫీ, యాదుల్లా కుమారులు. సోదరులిద్దరు వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఉమ్మడి ఆస్తికి చెందిన భూమి తల్లి పేరిట ఉంది. షఫీ చిన్న కూతురి వివాహం నిశ్చితార్థమయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. తనకు రావాల్సిన భూమి వాటాను పంచివ్వాలని తల్లిపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనోవేదనకు గురైన షఫీ గ్రామ సమీపంలోని ఎర్రకుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. షఫీ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి మరొకరు..



మల్లికార్జున్

శివ్వంపేట, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లుట్ల గ్రామానికి చెందిన లెంకల మల్లికార్జున్ (40) మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో భార్య మాధవితో గొడవపడి దసరా రోజు శనివారం పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దసరా రోజు గ్రామస్థులకు చెరువు వద్ద కనిపించిన మల్లికార్జున్ అప్పటి నుంచి ఆచూకీ లేదు. సోమవారం చెరువు వద్ద చూడగా ఆయన మృతదేహం లభించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదైంది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృత్యువాత



జ్యోతి

శివ్వంపేట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గేడి జ్యోతి(28) ఆదివారం సాయంత్రం ఇంటి దగ్గర గేదెలకు గడ్డివేసే క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే కామారెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జ్యోతికి భర్తతో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా భారాస


చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భారాస జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. హవేలిఘనపూర్ మండలం శమ్నాపూర్‌కు చెందిన పార్టీ కార్యకర్త బుస్స సత్తయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో, మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన మార్గం యాదగిరి విద్యుదాఘాతంతో మరణించగా.. వారికి పార్టీ ప్రమాద బీమా మంజూరైంది. ఈ మేరకు సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మండలాల నేతలు, కార్యకర్తలు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజాగౌడ్, లావణ్యరెడ్డి, ఆంజనేయులు, లింగం, రాధాకిషన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పడి.. కంకర తేలి..


అధ్వానంగా రాజ్యతండా రహదారి

న్యూస్‌టుడే, పాపన్నపేట: ప్రజల అవసరాలు, వాహనదారుల ఇక్కట్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆయా గ్రామాల్లో రోడ్లు వేస్తోంది. పలుచోట్ల ఏళ్ల కిందట నిర్మించిన రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి ధ్వంసమయ్యాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

రాత్రివేళల్లో ప్రమాదాల బారిన..

కొత్త లింగాయిపల్లి శివారు నుంచి అమ్రియాతండా, సోమ్లాతండా మీదుగా టేక్మాల్ మండలం షాబాద్ తండా వరకు సుమారు 4కి.మీ. దూరమున్న రోడ్డు చాలా వరకు ధ్వంసమై తారు లేచి గుంతలు పడింది. రోడ్డు అధ్వానంగా మారడంతో సోమ్లాతండా, అమ్రియాతండా, లింగాయిపల్లితండా, షాబాద్ తండాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం...

– గోపాల్, ఏఈ, పంచాయతీరాజ్

కొత్తలింగాయిపల్లి శివారు నుంచి అమ్రియాతండా, సోమ్లాతండాకు వెళ్లే దారితోపాటు మరికొన్ని ఇతర రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. రాజ్య తండా రోడ్డు విషయం మా దృష్టికి రాలేదు.

వర్షా కాలంలో కష్టాలు..

ఢాక్యా తండా శివారు నుంచి రాజ్యతండాకు వెళ్లే దారి కంకర తేలి అధ్వానంగా తయారైంది. వివిధ పనులపై బయటకు వెళ్లే తండా వాసులు ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలిచ్చినా తీరు మారడం లేదని తండావాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. దీంతోపాటు కుర్తివాడ, దౌలాపూర్ గేట్ల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లపై పలుచోట్ల తారులేచి గుంతలు పడ్డాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట	80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట	94402 31031
తూప్రాన్	96762 58144		(10AM TO 1 PM)
చేగుంట	80085 73200		

న్యూస్‌టుడే, అల్లాదుర్గం

? మండల పరిధిలోని వెంకట్‌రావుపేట్ నుంచి రేగోడు వెళ్లే రోడ్డుపై వాగు వద్ద సిమెంటు రోడ్డు బీటలు పడింది. ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – మహేశ్వరి, వెంకట్‌రావుపేట్.

✓ త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ, అల్లాదుర్గం



ఘనంగా శివపార్వతుల కల్యాణం

పాపన్నపేట, న్యూస్‌టుడే: మండల పరిధి బాచారం ఉమా సంగమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ అనంతరం కల్యాణం, హోమం చేశారు. అర్చకులు విశ్వనాథ శర్మ, నాయకులు వెంకట్ రాములు, దుర్గయ్య, రాము, వెంకట్ పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి వచ్చేనెల 14 వరకు నెల రోజులపాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి రాజు తెలిపారు. సోమవారం ఈ విషయమై విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామాలు, తండాల్లో సిబ్బంది వచ్చి టీకాలు వేస్తారన్నారు. పశుపోషకులు తప్పనిసరిగా జీవాలకు టీకాలు ఇప్పించుకోవాలని పశువైద్యాధికారి రాజు కోరారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నలగండ్ల అశోక్‌కుమార్ అన్నారు. నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కళాశాల ఎదుట సోమవారం ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించేందాకా కళాశాలలను తెరిచేది లేదన్నారు.

పల్లె వాకిట పచ్చందం



మండలంలోని పెద్దచింతకుంట సమీపంలో పచ్చని వరి పైరు కళకళలాడుతోంది. ఒక వైపు చెరువు.. మరోవైపు రైతులు సాగు చేసిన పొలాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పల్లె వాతావరణం ఎంతో హాయిగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. **- న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్**

స్థలం సిద్ధం.. నిర్మాణాలే ఆలస్యం



మండల పరిధి నాగ్సాన్‌పల్లిలో అంగన్వాడీ, సామాజిక భవనాల నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉంచారు. నిధులు మంజూరు కాకపోవడంతో స్థలం వృథాగా మారింది. గ్రామస్థులు భవనాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ కౌడిపల్లి సబ్ డివిజన్ డీఈ అమరేశ్వర్ దృష్టికి తీసుకెళ్లగా.. నిధులు మంజూరైతే వెంటనే నిర్మిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కౌడిపల్లి**

ఇసుక తొలగించరూ..



మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారి మార్గంలో మండలంలోని మంబోజిపల్లి, మాచవరం శివారులో దారిపై ఇరువైపులా ఇసుక పరుచుకోవడంతో వాహన చోదకులు వాపోతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాలైన ఘటనలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుకను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, మెదక్ రూరల్**

లక్ష్యానికి మించి సభ్యత్వాలకు కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: భాజపాకు అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వాల నమోదుకు పూర్తి సమయం ఇచ్చి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి డా.మురళీధర్‌గౌడ్, నాయకులు రాములు, రాజేందర్, రఘువీర్‌రెడ్డి, నందారెడ్డి, గడ్డం కాశీనాథ్, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

నర్సాపూర్: లక్ష్యానికి మించి సభ్యత్వాలకు కృషి చేస్తున్నామని భాజపా సభ్యత్వ సేకరణ జిల్లా బాధ్యుడు మురళీధర్‌గౌడ్ అన్నారు. నర్సాపూర్‌లో సోమవారం సభ్యత్వ నమోదును పరిశీలించి మాట్లాడారు. నేతలు మురళీయాదవ్, రమణారావు, రాజేందర్, కవితారెడ్డి, రమేష్, శ్రీకాంత్, అంజిగౌడ్ పాల్గొన్నారు.

పొలంలో గంజాయి మొక్కల ధ్వంసం


నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని శెట్టిపల్లికలాన్ పెద్ద చెరువు వద్ద పొలంలో సాగు చేసిన గంజాయి మొక్కలను సోమవారం ఎక్సైజ్ శాఖ రామాయంపేట సీఐ రాణి ఆధ్వర్యంలో ఎస్సై విజయ సిద్ధార్థ సిబ్బందితో కలిసి స్వాధీనపర్చుకున్నారు. సీఐ రాణి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎలబోయిన భూపాల్.. పొలం గట్లపై గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది. ఆయన సూచన మేరకు పొలంలో పరిశీలించగా.. ఏపుగా పెరిగిన 12 గంజాయి మొక్కలను గుర్తించారు. మొక్కలతోపాటు భూపాల్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ కృష్ణ వద్ద బైండోవర్ చేశారు.

దోమపోటుతో వరికి నష్టం


చిట్టోజీపల్లిలో పంట పరిశీలిస్తున్న ఏవో హరిప్రసాద్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి అగ్రహారానికి చెందిన రైతు కొము రయ్య ఎకరన్నర పొలంలో వరి సాగు చేస్తున్నాడు. పంటకు దోమపోటు సోకడంతో ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో తెగులు సోకినంత వరకు వరి పంటకు నిప్పు పెట్టాడు. సోమవారం 'ఈనాడు'లో 'పండించిన చేతులతో పంటకు నిప్పు' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్ వెళ్లి పంట పరిశీలించారు. వాతావరణంలో అధిక తేమ, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో సన్న వరికి దోమపోటు సోకిందన్నారు. మందు పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

చేగుంట: వరి పైరుకు దోమపోటు వ్యాప్తి చెంది నష్టం చేస్తోందని ఏవో హరిప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని చిట్టోజీపల్లిలో వానాకాలంలో సాగుచేసిన వరిపైరుకు సోకిన దోమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమను గమనించిన వెంటనే పైరు మొత్తం ఆరబెట్టాలన్నారు. అవసరమైన క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలన్నారు.

అలయ్ బలయ్‌తో ఐక్యత


శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న వ్యాపారులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: అలయ్ బలయ్ కార్యక్రమం ద్వారా ఆర్యవైశ్యుల్లో ఐక్యత పెంచాలని సంఘం జిల్లా మహాసభ అధ్యక్షుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గుప్తా సూచించారు. నర్సాపూర్‌లోని రైస్‌మిల్లర్ల సంఘం కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలిసికట్టుగా ఉంటేనే ఏదైనా సాధ్యమన్నారు. గౌరవాధ్యక్షుడు నోముల శ్రీను, కోశాధికారి హరీష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.


హవేలిఘనపూర్: సర్దనలో దుర్గామాత విగ్రహం వద్ద యువకులు


టేక్మాల్‌లో..


చేగుంటలో..

ఉత్సాహంగా దుర్గామాత నిమజ్జనాలు

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం దుర్గామాత నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. యువత, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం

విద్యుత్తు అధికారుల బదిలీ

తూప్రాన్: విద్యుత్తు డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. సోమవారం తూప్రాన్ కొత్త డీఈగా గరట్‌మంతరాజు, ఏడీఈగా టి.శ్రీనివాస్, ఏఈగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. సిబ్బంది వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, షాదుల్ హుసేన్, జీవన్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింలు, ముత్యాలు, కృష్ణ ఉన్నారు.

నూతన ఉపాధ్యాయులకు కళాశాలలో సన్మానం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసిన పలువురు డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో వారిని శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.హుసేన్ మాట్లాడుతూ.. అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న ఎండీ సమీ, రవీందర్ ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు ఇస్తున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన కుమార్‌కు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ సోమవారం రూ.49వేల చెక్కు ఇచ్చారు. నాయకులు రవీందర్‌రెడ్డి, మల్లేశం, హరీష్, రశీద్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట: మండల పరిధి బి.కొండాపూర్‌కు చెందిన నిరుపేద వృద్ధురాలు లచ్చవ్వ సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలిసిన భారాస నేత రంగయ్యగారి రాజిరెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.



పండగ ముగిసింది.. పల్లె పొమ్మంది

దసరా సెలవులు ముగియడంతో పెద్దలు, విద్యార్థులు సోమవారం తిరుగు పయనమయ్యారు. ఉపాధికి హైదరాబాద్‌కు వెళ్లిన వారంతా పండగలకు సొంతూళ్లకు వచ్చారు. తిరిగి నగరానికి బయలుదేరడంతో సోమవారం బస్సులు ప్రయాణికులతో కిక్కిరిశాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నా ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో సీట్లు దొరక్క ఇబ్బందులు పడ్డారు.

- న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

తుప్పు పడుతున్నాయ్.. పట్టించుకోరూ..


పొదల్లో తుప్పుపడుతున్న ప్రభుత్వ వాహనం..

ఈ చిత్రంలో కనిపిస్తున్న వాహనం తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పు పడుతుంది. దశాబ్దం క్రితం తూప్రాన్ తహసీల్దారుగా విధులు నిర్వర్తించే అధికారులు ఈ వాహనాన్ని వినియోగించారు. మరమ్మతులకు గురికావడంతో అప్పటి నుంచి వచ్చిన తహసీల్దార్లు తమ సొంత వాహనాలనే వాడుతున్నారు. దీంతో ఈ వాహనం చెట్లపొదల్లో తుప్పుపట్టి పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు, సిబ్బంది దృష్టి సారించక పోవడంతో వాహన సామగ్రిని దొంగలు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఆ వాహనాన్ని పాత ఇనుప దుకాణంలో విక్రయించి, వచ్చిన నిధులతో ప్రజా ఉపయోగాల కోసం వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తూప్రాన్**

నడవొద్దు.. దూకేయాలి!



పట్టణంలోని ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయం ముందున్న మురుగు కాల్వపై పైకప్పు లేక రాకపోకలు సాగించేవారు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాల్వ నిర్మించిన పుర అధికారులు అవసరమైన చోట మాత్రం పైకప్పులు ఏర్పాటు చేయలేదని పట్టణవాసులు వాపోతున్నారు. కాల్వ దాటి కార్యాలయంలోకి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి పడిపోతున్నారు. **- న్యూస్‌టుడే, నర్సాపూర్**

మాజీ మంత్రిని కలిసిన నేతలు



మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిశారు. ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి, గోమారం చంద్రాగౌడ్, మన్సూర్ తదితరులు కలిసి దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్, శివ్వంపేట

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, గణపతి, నవగ్రహ హోమాలు, జలాభిషేకం, మండప పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. భక్తులు పాల్గొన్నారు.

దాబా, పాఠశాలలో చోరీ

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: తాళం పగలగొట్టి ధాబాలోని కౌంటర్‌లో ఉంచిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నిజాంపేట మండలం చల్మెడకు చెందిన మంగిపల్లి స్వామి గ్రామ శివారులోని కమాన్ వద్ద ధాబా నిర్వహిస్తున్నాడు. దసరా రోజు పూజలు చేసి తాళం వేసి ఇంటికెళ్లాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి కౌంటర్‌లో ఉంచిన రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం స్వామి ధాబాకు రాగా.. చోరీ విషయం వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదైంది. అలాగే నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో గది తాళం పగలగొట్టి టీవీ ఎత్తుకెళ్లారు.

మండల కేంద్రంలో ల్యాప్‌టాప్ అపహరణ..

కౌడిపల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు తీసి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శేరితండాకు చెందిన దేవిచంద్‌కు మండల కేంద్రంలో దుస్తుల దుకాణం ఉంది. దానిపైనే నివాసముంటున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మెదక్‌కు వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికొచ్చారు. ఇంటికి తాళం వేయకుండా తలుపులు ముందుకు వేసి వెళ్లడంతో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. రెండు ల్యాప్‌టాపులు ఎత్తుకెళ్లారు. బాధితుడు సోమవారం ఠాణాలో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైంది.

పక్కా భవనాలకు ఇంకెన్నాళ్లో?

మండలం ఏర్పడి 8 ఏళ్లు పూర్తి

న్యూస్‌టుడే, చిలప్‌చెడ్

ఉమ్మడి కౌడిపల్లి నుంచి 19 పంచాయతీలతో చిలప్‌చెడ్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లవుతోంది. ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలు పక్కా భవనాలకు నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావొస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు.


అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం

తప్పని ఇబ్బందులు...

కొత్తగా మండలం ఏర్పాటైనా సమస్యల పరిష్కారం మాత్రం అంతంత మాత్రమేనని ప్రజలు అంటున్నారు. చాలా కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఎంపీడీవో, ఉపాధిహామీ కార్యాలయాలు మత్స్య శాఖ భవనంలో, తహసీల్దార్, ఐకేపీవి అద్దె భవనాల్లో, ఠాణా గోపాలమిత్ర భవనంలో కొనసాగుతున్నాయి. ఎంఈవో, వ్యవసాయశాఖ, విద్యుత్తుశాఖ, తాగునీటి సరఫరాల శాఖ తదితర కార్యాలయాలు మండల పరిధిలో ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఇంతవరకు తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో మండలం ఏర్పడినా పాత సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సదుపాయాలు అంతంత మాత్రమే..

తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆయా శాఖల కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ ఒక్క కార్యాలయంలోనూ శౌచాలయాలు సరిగ్గా లేకపోవడం శోచనీయం. మహిళా అధికారులు, సిబ్బంది అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి..: రాజేందర్‌రెడ్డి, శీలాంపల్లి

మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేక అధికారులు, సిబ్బంది చాలీచాలని గదుల్లో విధులు నిర్వహిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి వచ్చిన ఫిర్యాదు పత్రాలను ఎక్కడ పెట్టాలో ఎరుగని స్థితిలో కొన్ని కార్యాలయ భవనాలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేయాలి.

ఎలాంటి ఆదేశాలు రాలేదు..: ముసాదిక్, తహసీల్దార్

కార్యాలయాల నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సూచనలు రాలేదు. గతంలో శీలాంపల్లిలోని ప్రభుత్వ భూమిలో నిర్మించేందుకు స్థలం సేకరించాలని ఆదేశాలొచ్చాయి. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో ప్రభుత్వ స్థలం లేదు. ప్రజలు సహకరిస్తే సమస్యలు తీరే అవకాశముంది.

తహసీల్దారు కార్యాలయంలో పాము

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం నల్ల తాచు పాము సిబ్బంది కంటపడింది. రెండ్రోజులు సెలవులు రావడం, కార్యాలయం వెనకాలే పొలాలు ఉండటంతో పాము వచ్చి ఉంటుందని చెబుతున్నారు. సిబ్బంది గమనించి తహసీల్దార్ మన్నన్ దృష్టికి తీసుకెళ్లగా.. కార్మికులను పిలిపించి కార్యాలయాల సముదాయం లోని పిచ్చి మొక్కలను తొలగింపజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందారని రెండో ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రెడ్డిపల్లి సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయాలపాలయ్యారు. వారిలో సిద్ధార్థ(24) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవపరీక్ష అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.